క్లుప్తంగా

వైభవంగా శివపార్వతుల కల్యాణోత్సవం

పెద్దతిప్పసముద్రం: అరుద్ర నక్షత్రం సందర్భంగా బుధవారం స్థానిక పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో శివ పార్వతుల కల్యాణోత్సవం కార్యక్రమం కనుల పండగగా నిర్వహించారు. ఆలయం నిర్వాహకులు సనగరం పట్టాభిరామయ్య ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవ కార్యక్రమాలకు భక్తులు హాజరై పూజలందుకున్నారు. వేద పండితులు ఖన్న స్వామి, పణితేజలు శివ పార్వతుల ప్రతిమలకు ప్రత్యేక పుష్పాలతో సుందరంగా అలంకరించి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

బూచిపల్లిలో బ్రహ్మోత్సవాలు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని బూచిపల్లిలో చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమైనట్లు గ్రామస్థులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఉదయం సుప్రభాత సేవ, వేద పారాయణ, అభిషేకం, మహా మంగళహారతి, అంకురార్పణ, కలశ స్థాపన, అగ్ని ప్రతిష్ట, ధ్వజారోహణ, అష్టావధానసేవ కార్యక్రమాలను కనుల పండుగగా నిర్వహించారు. గురువారం స్వామి వారి కళ్యాణోత్సవం, శుక్రవారం బ్రహ్మ రథోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు పేర్కొన్నారు.

రేపు వాహనాల వేలం

ములకలచెరువు : అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడిన వాహనాలకు శుక్రవారం వేలం నిర్వహిస్తున్నట్లు ఎస్ఈబీ సీఐ మల్లిక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఐ కథనం మేరకు.. ఉన్నతాధికారుల ఆదేశాలతో వివిధ కేసుల్లో పట్టుబడిన 22 ద్విచక్రవాహనాలకు వేలం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న వారు రూ.1000 చెల్లించి వేలంలో పాల్గొనాలని సీఐ తెలిపారు.

ముదివేడు పంచాయతీకి ఆదాయం

కురబలకోట : మండలంలోని ముదివేడు పంచాయతీకి వారపు సంత గేటు వేలం ద్వారా రూ. 4,02,500 ఆదాయం వచ్చినట్లు సర్పంచ్ సహనాజ్ బేగం, కార్యదర్శి రామప్ప నాయుడు తెలిపారు. బుధవారం కార్యాలయం వద్ద వేలం నిర్వహించారు.

సారా విక్రేత అరెస్టు

కేవీపల్లె : 13 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని ఓ నిందితున్ని అరెస్ట్ చేసినట్లు పీలేరు స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ వై. గురుప్రసాద్ తెలిపారు. మండలంలోని జిల్లేళ్లమంద తాండా కొత్త బిడికిలో సారా విక్రయాలు జరుగుతున్నట్లు అందిన సమాచారంతో సెబ్ సిబ్బంది దాడి చేశారు. గ్రామానికి ఎం. చంద్రానాయక్ సారా కలిగి ఉండగా అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

మైనారిటీల సమస్యలు కేంద్రం దృష్టికి

కలికిరి : రాష్ట్రంలోని ముస్లిం మైనారిటీల సమస్యలు, అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై ఢిల్లీలో బుధవారం జరిగిన జాతీయ మైనారిటీ సదస్సు వేదికగా కేంద్ర మైనారిటీ ఎఫైర్స్ మంత్రి జాన్ బిర్లా దృష్టికి తీసుకెళ్లినట్లు రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడారు. కేంద్రం నుంచి అందిన ఆహ్వానం మేరకు సదస్సుకు హాజరై రాష్ట్రం తరఫున ప్రాతినిత్యం వహించడం జరిగిందని, మైనారిటీల అభివృద్ధికై చర్చించినట్లు పేర్కొన్నారు.

చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

గుర్రంకొండ : చలివేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గుర్రంకొండ మేజర్ పంచాయతీ సర్పంచ్, ఉపసర్పంచ్‌లు మెహర్ తాజ్, కొండేటి సుమలత అన్నారు. బుధవారం స్థానిక బస్టాండులో నూతనంగా చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు నిత్యం రాకపోకలు సాగించే వేలాది మంది ప్రయాణికులు తాగు నీటి సౌకర్యార్థం చలివేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మండల ప్రత్యేక అహ్వానితులు కందుల గుణశేఖర్, మాజీ ఎంపీపీ జమీర్‌అలీఖాన్, పంచాయతీ ఈవో బ్రహ్మానందరెడ్డి, మణికుమార్, నిస్సార్ పాల్గొన్నారు.

8 చోట్ల చలివేంద్రాలు ఏర్పాటు

బి.కొత్తకోట : నగర పంచాయతీ పరిధిలో 8 చోట్ల వేసవి చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని నగర పంచాయతీ మేనేజర్ రమాదేవి బుధవారం తెలిపారు. కార్యాలయం ఆవరణలో ఒకటి ప్రారంభించామని, ఐదు సచివాలయాల పరిధిలో ఐదుచోట్ల, ఆస్పత్రి, దిగు బస్టాండ్‌లో రెండుచోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేసి నిర్వహిస్తామని తెలిపారు. ఈ కేంద్రాలను నిత్యం పర్యవేక్షిస్తూ ప్రజలకు చల్లని మంచినీటిని అందిస్తామని తెలిపారు.

సచివాలయ సేవలపై సమీక్ష

బి.కొత్తకోట: నగర పంచాయతీ కార్యాలయంలో మేనేజర్ రమాదేవి, సచివాలయ ఉద్యోగులు, వీఆర్‌ఓలతో బుధవారం మదనపల్లె డివిజన్ అభివృద్ధి అధికారి వేలూరు లక్ష్మీపతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయాల ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను సమీక్షించారు. సచివాలయ ఉద్యోగులకు ప్రభుత్వం అప్పగించిన బాధ్యతల్లో భాగంగా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసి వాటి స్థితిగతులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ప్రభుత్వం 535 సేవలను అందిస్తోందని, నిర్ణీత గడువులో ప్రజలకు సేవలు అందించాలన్నారు. ఆధార్ కార్డు తీసుకుని 10 ఏళ్లయిన వాళ్లు తక్షణమే అప్‌డేట్ చేసుకోవాలని లేనిపక్షంలో ఆధార్‌కార్డు పనిచేయదని స్పష్టం చేశారు.

పారదర్శక పాలన సీఎం జగన్‌కే సాధ్యం

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం : రాష్ట్రంలో పారదర్శకమైన పరిపాలన అందించడం సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డికే సాధ్యమని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం ఉదయం మండలంలోని మేకలవారిపల్లి, రాములవారిపల్లి, చారావాండ్లపల్లి, మద్దెలచెరువుపల్లి గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, కాలువలు, విద్యుత్ స్తంభాలు, విద్యుత్ దీపాలు, పింఛన్లు, ఇండ్లు తదితర సమస్యలను ఎమ్మెల్యే చింతల దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ ప్రజా సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు ఆనందంగా ఉన్నారన్నారు. అందుకే గత నాలుగేళ్లుగా ఎక్కడ ఎన్నికలు జరిగినా వైఎస్సార్‌సీపీకి బ్రహ్మరథం పడుతున్నారన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించడంలో వలంటీర్లు ముఖ్య భూమిక పోషిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాల అమలు, రూపాయి లంచం లేకుండా నేరుగా అర్హులకే చేరే విధానం దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. అన్నివర్గాల వారికి మంచి చేస్తూ వస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అందరి గుండెల్లో కొలువై ఉన్నాడన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా వలంటీర్ల ద్వారా అధికారుల దృష్టికి తీసుకొస్తే, సమస్యను పరిశీలించి పరిష్కరిస్తారని తెలిపారు. దేశంలోని ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన వలంటీర్ వ్యవస్థ, ఇతర పథకాలు అమలు చేయాలనే ఆలోచనలో ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్, తహసీల్దార్ ఫిరోజ్ ఖాన్, వైస్ ఎంపీపీలు వెంకట్రమణ, కిరణ్ కుమర్, నాయకులు చింతల శివానంద రెడ్డి, ఓరుగంటి రమేష్, లక్ష్మినారాయణ రెడ్డి, ఫారుఖ్, నల్లంకి నరసింహులు, చెంగల్‌రెడ్డి, మోహన్ రెడ్డి, ధ్వారకనాథరెడ్డి, సుధాకర, మెంబర్ శీనా, శ్రీరాములు, మోహన, గంగులప్ప, శీన, వెంకట్రమణ రెడ్డి, అన్ని శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ నవమి శుభాకాంక్షలు

శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో పీలేరు నియోజకవర్గ ప్రజలు పాడిపంటలతో సంతోషంగా ఉండాలని, శ్రీరామ నవమి సందర్భంగా ప్రజలకు పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

కలికిరి : పేద కుటుంబాలను ఆదుకోవడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పెద్ద మనస్సుతో కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని గుట్టపాళెం గ్రామం చీకిరాల బర్నేపల్లికి చెందిన యువ కౌలు రైతు సి.శేఖర వ్యవసాయానికి చేసిన అప్పులు తీర్చలేక కొంత కాలం క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య, ఒక కుమార్తె ఉన్నారు. మృతుని భార్య అభ్యర్థన మేరకు స్థానిక సర్పంచ్ రెడ్డివారి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేని కలిసి ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. దీంతో ఎమ్మెల్యే చింతల కృషితో బాధిత కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.3లక్షలు నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే చేతుల మీదుగా బాధితురాలికి చెక్కును అందజేశారు.



బాధితురాలికి సీఎం సహాయ నిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వైఎస్సార్ సీపీని ఆదరించండి

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



ఇంటింటికీ కొళాయి పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

తంబళ్లపల్లె : నియోజకవర్గ ప్రజలు వైఎస్సార్ సీపీని ఆదరించి అత్యధిక మెజార్టీతో విజయం అందించాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి కోరారు. బుధవారం కన్నెమడుగు, కె.రామిగానిపల్లె, హరిజనవాడ, కుడమలవారిపల్లె, నల్లమాచిరెడ్డిగారిపల్లె, గోళ్లవారిపల్లె, లక్ష్మీపురం లలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సాగింది. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్తూ గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలతో చేకూరిన లబ్ధిని వివరించారు. కన్నెమడుగు పంచాయతీలో జలజీవన్‌మిషన్ ద్వారా రూ.29.70 లక్షల ఖర్చుతో ఇంటింటికీ కొళాయి ఏర్పాటును ఆయన ప్రారంభించారు. ఇప్పటికే నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి తారు, సీసీ రోడ్లు ఏర్పాటు చేశామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణ ప్రాంతాల్లోని పేద, మధ్య తరగతి ప్రజల అభివృద్ధే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారన్నారు.

భూ సర్వే ప్రతిష్టాత్మకం

ఎప్పుడో బ్రిటీష్‌పాలనలో జరిగిన భూ సర్వే అనంతరం ఏ ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో రాష్ట్రంలో భూ సమస్యలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా భూ రీ-సర్వే చేపట్టి భూ రక్షా పథకం ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు. మొదటి విడతలో కన్నెమడుగు పంచాయితీలో భూ రీసర్వే పూర్తి చేయడంతో రైతుల భూములకు సరిహద్దు రాళ్లనాటి ఎమ్మెల్యే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమాలలో తహసీల్దార్ కళావతి, ఎంపీడీఓ ఆనంద్‌కుమార్, హౌసింగ్ డీఈ శ్రీహరి, సర్పంచులు శ్యామలమ్మ, జ్యోతి, నాయకులు చంద్రశేఖర్, రామశంకర్‌రెడ్డి, మద్దిరెడ్డి, మల్లప్ప, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళితులకు భూ పంపిణీ చేయాలని వినతి

పీలేరు : అర్హులైన నిరుపేద దళితులకు భూ పంపిణీ చేయాలని వివిధ దళిత సంఘ నాయకులు పి.వి. రమణ, లక్ష్మీపతి, నరేష్ కోరారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద దళిత సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేసి అనంతరం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితులకు రెండెకరాల చొప్పున భూ పంపిణీ చేస్తామన్న ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. ఇప్పటికైనా 8వ విడత భూ పంపిణీలో అర్హులైన దళితులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు వినోద్ కుమార్, విజయ్‌కుమార్, మహేష్, నాగరాజ, మోహన్‌బాబు, సిద్ధయ్య, మహేశ్వర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న దళిత సంఘాల నాయకులు

ప్రతి పంచాయతీ నుంచి విధిగా చెత్త సేకరణ

డీపీఓ ధనలక్ష్మి



వర్మికంపోస్టు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీపీఓ ధనలక్ష్మి తదితరులు

కలకడ : ప్రతి పంచాయతీ నుంచి చెత్త సేకరణ విధిగా జరగాలని జిల్లా పంచాయతీ అభివృద్ధి అధికారి మిద్దింటి ధనలక్ష్మి, ఎంపీడీఓ, పంచాయతీ అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని ఎనుగొండపాళ్యెం, కదిరాయచెర్వు పంచాయతీలలో పర్యటించి చెత్తసేకరణ జరుగుతున్న తీరు, డంపింగ్ యార్డ్‌లలో నిల్వ ఉన్న చెత్త, తడి, పొడిచెత్త సేకరణ, సిబ్బంది గ్రామాలలో చేపట్టిన పారిశుధ్యం పనులను అడిగి తెలుసుకున్నారు. చెత్తసేకరణ కేంద్రాలను సేంద్రీయ ఎరువుల ఉత్పత్తి కేంద్రాలుగా అభివృద్ధి చేయాలన్నారు. కేవలం ఆర్థిక సంఘం నిధుల వైపే పంచాయతీలు ఎదురు చూడకుండా, చెరువులలో చేపలు పెంచడం, చెత్తసేకరణ ద్వారా, ఎరువులు తయారు చేసి విక్రయించడం, ఇంటి పన్ను వసూలు, ఇంటి నిర్మాణం కోసం అనుమతులు వంటివి వందశాతం పూర్తి చేయాలని ఆదేశించారు. వేసవిలో ఎక్కడా నీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ నారాయణను ఆదేశించారు. అనంతరం కదిరాయచెర్వులో సర్పంచ్ లక్ష్మిప్రసన్న ఏర్పాటు చేసిన చలివేంద్రం ప్రారంభించి మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎనుగొండపాళ్యెం సర్పంచ్ మంజుల, ఆయా పంచాయతీల కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, మోహన్‌రాజ, మండల ఉపాధ్యక్షులు ఈశ్వర్‌నాయుడు, కుమార్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా జనార్దన్‌రెడ్డి



బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్, సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

మదనపల్లె : మదనపల్లె బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పి.జనార్దనరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బార్ అసోసియేషన్‌కు బుధవారం ఎన్నికలు నిర్వహించారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా జనార్దనరెడ్డి, ఉపాధ్యక్షుడిగా టి.వెంకటరమణారెడ్డి, జాయింట్ సెక్రటరీగా సోమశేఖర్, ట్రెజరర్‌గా సురేష్‌బాబు, లైబ్రరీ సెక్రటరీ ప్రసాద్, ఈసీ మెంబర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జనరల్ సెక్రటరీ, లేడీ రిప్రజెంటేటీవ్‌కు జరిగిన ఎన్నికల్లో న్యాయవాదులు మనోహర్, సుజాతలు అధిక మెజారిటీతో గెలుపొందారు. ఈ సందర్భంగా న్యాయవాది బాలకృష్ణారెడ్డి, బిల్డింగ్ వర్కర్స్ ప్రెసిడెంట్ జంగాల శ్రీనివాసులు, సెక్రటరీ రెడ్డిసాహెబ్(బాబుమేస్త్రీ), పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు, రాజకీయనాయకులు, ప్రజా సంఘాల నాయకులు నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

వ్యవసాయ కూలీల సమస్యలు పరిష్కరించాలి

ఏపీవీవీయూ రాష్ట్ర కార్యదర్శి శోభ



వ్యవసాయ కూలీల సమస్యలను వివరిస్తున్న శోభ

నిమ్మనపల్లె : వ్యవసాయ కూలీల సమస్యలు పరిష్కరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కృషిచేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ రాష్ట్ర కార్యదర్శి శోభ అన్నారు. బుధవారం స్థానిక ఎమ్మార్సీ భవనంలో మండల, గ్రామీణ కమిటీ సభ్యులతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వ్యవసాయ కూలీలు అనేక సమస్యలతో దుర్భర జీవితం గడుపుతున్నారని అన్నారు. ప్రస్తుతం గ్యాస్ సిలిండర్ ధర సుమారు రూ.1,200కు పైగా ఉందని, చాలీచాలని కూలీలతో గ్యాస్ సిలిండర్ కొనేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి గ్యాస్‌ధరను తగ్గించాలన్నారు. తరతరాలుగా కూలీలపైనే ఆధారపడి జీవిస్తున్న కూలీలకు ఆహార భద్రత కొరవడిందన్నారు. భూమిలేని మహిళా కూలీలకు ఐదుఎకరాల సాగుయోగ్యమైన భూమిని పంపిణీ చేయాలన్నారు. దళితవాడల్లో శ్మశానవాటికలు ఏర్పాటుచేయాలని విన్నవించారు. కార్యక్రమంలో ఏపీవీవీయూ మండల కార్యదర్శి చంద్రశేఖర్, మండల, గ్రామీణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉంటే ఉపేక్షించం

తంబళ్లపల్లె: నియోజకవర్గంలో అధికారులు, సచివాలయ ఉద్యోగులు విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉంటే ఉపేక్షించేదిలేదని, చర్యలు తప్పవని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి హెచ్చరించారు. బుధవారం పంచాయతీరాజ్ గెస్ట్‌హౌస్‌లో నియోజకవర్గంలోని ఎంపీడీఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలాలవారి ఇప్పటి వరకూ జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యలు సచివాలయ ఉద్యోగుల పనితీరు, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై ఆరాతీశారు. ప్రతి మండలంలోనూ ఎంపీడీఓల పర్యవేక్షణ ఉండాలన్నారు. జగనన్న ఇళ్ల నిర్మాణ పనులు అనుకున్న లక్ష్యాలను పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. ఇంకా అర్హులై ఉండి ఇల్లు మంజూరు కాకుంటే అటువంటి వారిని గుర్తించి వారి సమాచారం సేకరించి ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. సమీక్షలో తంబళ్లపల్లె, ములకలచెరువు, పీటీయం, పెద్దమండ్యం, కురబలకోట, బి.కొత్తకోట ఎంపీడీఓలు ఆనంద్‌కుమార్, అశ్విని, గిరిధర్‌రెడ్డి, శ్రీధర్‌రావు, దిలీప్‌కుమార్, శంకరయ్య, రాష్ట్రపద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ సురేంద్రనాథ్ పాల్గొన్నారు.

శిలాఫలకం ధ్వంసం చేసిన దుండుగుల్ని శిక్షించాలి

గుర్రంకొండ: ఉమ్మడి చిత్తూరు జిల్లా వెదురుకుప్పంలో ఇటీవల ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహం ఏర్పాటు కోసం సిద్ధం చేసిన శిలాఫలాకాన్ని ధ్వంసం చేసిన దుండగుల్ని శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెడ్డి సంఘం గౌరవాధ్యక్షులు వరదారెడ్డి నారదరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం గుర్రంకొండలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్రిటిషు వాళ్లకు కప్పం చెల్లించవద్దని రాయలసీమలో మొట్ట మొదటిసారిగా తిరుగుబాటు చేసిన స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అన్నారు. అలాంటి మహనీయుడి విగ్రహాన్ని వెదురుకుప్పంలో ఏర్పాటు చేసేందుకు అన్ని సిద్ధం చేశారన్నారు. అయితే కొంతమంది దుండగులు అక్కడ ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ధ్వంసం చేశారన్నారు. ఇలాంటి వారిపై చట్ట పరంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో నిమ్మనపల్లె గంగిరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, బీసీ సంఘాల నాయకులు శ్రీనివాసులు, నారాయణ, యశ్వంత్‌లు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ పాలనలో గిరిజనులకు పెద్దపీట

- ఎస్టీల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కమిషన్ ఏర్పాటు
- రాజకీయ, నామిటేడ్ పదవుల్లోనూ అగ్రస్థానం



గిరిజనుల సమస్యలపై ఎమ్మెల్యే నవాజ్‌బాషా, ఎస్టీ కమిషన్ మెంబర్ వడిత్యాశంకర్‌నాయక్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న నాయకులు

మదనపల్లె : వైఎస్సార్ సీపీ పాలనలో గిరిజనులకు పెద్దపీట వేస్తూ, ప్రతి విషయంలోనూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారికి అండగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. మదనపల్లె మండలంలోని కోటవారిపల్లె తండాలో దారి సమస్య పరిష్కారానికి ఎస్టీ కమిషన్ మెంబర్ వడిత్యా శంకర్‌నాయక్ రాక సందర్భంగా బుధవారం గ్రామంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. కోటవారిపల్లె తండా అభివృద్ధిపై మండల అధికారులను విచారించారు. ఎమ్మెల్యే నవాజ్‌బాషా మాట్లాడుతూ.. గిరిజనుల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. తండాలను అభివృద్ధి చేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అవసరమైన అన్ని మౌలిక వసతులను కల్పిస్తూ, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందేలా చూస్తున్నామన్నారు. కోటవారిపల్లె తండాలో 55ఏళ్లుగా దారి సమస్య అపరిష్కృతంగా ఉందని, దారి స్థలం ప్రైవేట్ వ్యక్తికి చెందినది కావడంతో ఆలస్యమైందని, కోటవారిపల్లె తండా ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం రోడ్డు సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఎస్టీ కమిషన్ మెంబర్ వడిత్యాశంకర్‌నాయక్ మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆలోచన మేరకు, రాజ్యాంగస్ఫూర్తితో గిరిజనులు కోల్పోయిన హక్కులను కాపాడుకునే దిశగా సీఎం వైఎస్ జగన్ నాయకత్వంలో రాష్ట్రంలో ఎస్టీ కమిషన్ ఏర్పాటైందన్నారు. గత ప్రభుత్వాలు గిరిజనులను ఓటుబ్యాంకు యంత్రాలుగా పరిగణించాయన్నారు. దళితులు, గిరిజనులను అభివృద్ధి వైపు నడిపించాలని నిరంతరం కృషి చేస్తున్న నాయకుడు వైఎస్ జగన్ అని అన్నారు. కోటవారిపల్లె తండా దారి సమస్యపై ఆగ్రామ రైతుతో మాట్లాడారు. తండా గిరిజనుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అందజేసే పరిహారం తీసుకుని సమస్య పరిష్కారానికి సహకరించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో కోటవారిపల్లె సర్పంచ్ భుక్యారాజేశ్వరి, ఎంపీటీసీ విజయకుమారి, నారమాకులతండా సర్పంచ్ మూడే సునీత, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శంకర్‌నాయక్, ఎస్సీ,ఎస్టీ మానిటరింగ్ కమిటీ మెంబర్ బాణావత్ మునీంద్రనాయక్, ఆల్‌ఇండియా బంజార సంఘం నాయకులు నాగూనాయక్, రాష్ట్ర గిరిజన సమాఖ్య అధ్యక్షులు కోనేటిదివాకర్, పుంగనూరు వైస్ ఎంపీపీ ప్రభాకరనాయక్, కోటవారిపల్లె సత్య, సాక్కంవేణు, రఘు, హరినాయక్, మార్కెట్‌కమిటీ డైరెక్టర్ తట్టిశ్రీనివాసులు, సర్పంచ్ దండుకరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఇష్టపడి చదవండి

పెద్దతిప్పసముద్రం : ప్రతి ఒక్కరూ కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చని ఎంఈఓ నారాయణ అన్నారు. బుధవారం మండలంలోని కందుకూరు జెడ్పీ హైస్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ పరీక్షలకు సంబంధించి విద్యార్థులు ఎలాంటి ఒత్తిళ్లకు, భయాదోళనలకు లోను కాకుండా ఉండాలని దిశా నిర్దేశం చేశారు. హెచ్‌ఎం మల్లయ్య, స్కూల్ కమిటీ చైర్మన్ బుడ్డాబాబు తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

వాల్మీకిపురం : అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని, ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ శివసాగర్ తెలిపారు. తరిగొండ క్రాస్ వద్ద భారీగా కర్ణాటక మద్యం తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పాకాల మండలం కామాటంపల్లి, ప్రస్తుతం వాల్మీకిపురం పట్టణంకు చెందిన మునిరెడ్డి (44), మల్లిరెడ్డిగారిపల్లికి చెందిన నరసింహులు (37)లు అక్రమంగా మద్యం ప్యాకెట్లను తరలిస్తుండగా వారిని అదుపులోకి తీసుకొని, వారి వద్ద ఉన్న 90 ఎంఎల్ 440 ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

టీబీ రోగులకు సరుకులు అందజేత

ములకలచెరువు: మండలానికి చెందిన టీబీ రోగులకు బుధవారం పీహెచ్‌సీలో పోషకాహార సరుకులు ప్రభుత్వ డాక్టర్లు జాహ్నవి, రేష్మా చేతుల మీదుగా పంపిణీ చేశారు. పీహెచ్‌సీ సిబ్బంది, డాక్టర్ల ఆర్థిక సహాయంతో 15 మందికి పంపిణీ చేశారు. టీబీ రోగులు సమయానికి చికిత్స చేయించుకుంటూ ఆరోగ్య సిబ్బంది సలహాలు, సూచనలు పాటించాలని డాక్టర్లు సూచించారు.

చిరుధాన్యాలలో పోషక విలువలు



పోషణ్ పక్వాడా కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు

కేవీపల్లె : చిరుధాన్యాలు మంచి పోషక విలువలు కలిగి ఉంటాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నపూర్ణ అన్నారు. బుధవారం మండలంలోని జల్లేళ్లమంద సెక్టార్ పరిధిలో ఎంపీపల్లెలో పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, యుక్త వయస్సు బాలికలు పోషకాహార లోపాన్ని నిర్మూలించుటకు మిల్లెట్ ఆధారిత ఆహారం తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ పోషకాహార ఆవశ్యకతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ శశికళ, అంగన్‌వాడీ కార్యకర్తలు స్వర్ణ, సుశీల, మంగమ్మ, ప్రభావతి, శ్రీదేవి, రంగమ్మ, మహేశ్వరి, ఆశ వర్కర్ నాగభూషణమ్మ తదితరులు పాల్గొన్నారు

ఘనంగా నవమి ఉత్సవాలు ప్రారంభం



పవిత్ర జలాన్ని ఊరేగింపుగా తీసుకెళుతున్న మహిళలు

పీలేరు రూరల్ : పట్టణంలో శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. బుధవారం సాయంత్రం స్థానిక సదుం మార్గంలో కల్యాణ సీతారామస్వామి వారి ఆలయంలో పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. వందమంది ముత్తైదువులచే స్థానిక వినాయకస్వామి ఆలయం నుంచి సదుం మార్గంలోని రామాలయం వరకు జలం మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లారు. సీతారాములవారికి వారికి ఘనంగా జలాభిషేకం చేపట్టారు. అనంతరం ధ్వజారోహణం, గణపతి హోమంతో ఉత్సవాలు ప్రారంభించారు. అలాగే కోదండరామస్వామి ఆలయంలోనూ స్వామివారికి జలాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. గురువారం సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నగర పంచాయతీలో ఆర్థిక అవకతవకలపై నివేదిక

- జమ కాని నిధులు రూ.10 లక్షలు
- బాధ్యులపై చర్యలకు సిఫార్సు

బి.కొత్తకోట : 2021-22 ఆర్థిక సంవత్సరంలో బి.కొత్తకోట నగరపంచాయతీలో జరిగిన ఆర్థిక అవకతవకలపై ఉన్నతాధికారులకు నివేదిక వెళ్లింది. 2019 డిసెంబర్‌లో మేజర్ గ్రామపంచాయతీ స్థాయి నుంచి నగర పంచాయతీ అయ్యింది. 2020 జనవరి 19 నుంచి కమిషనర్ పాలన అమలులోకి వచ్చింది. దీనికి ఎఫ్ఏసీ కమిషన ర్లు బాధ్యతలు చూశారు. 2021-22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నగర పంచాయతీ ఆదాయం, ఖర్చులపై ప్రభుత్వ ఆడిటర్లు ఆడిట్‌ను నిర్వహిస్తున్నారు. ఇందులో ప్రజలకు చెల్లించిన ఇంటి పన్నుల రశీదులపై అనుమానాలు వ్యక్తం చేస్తూ పలువురు మున్సిపల్ ఆర్డీకి ఫిర్యాదు చేశారు. దీనిపై ఆర్డీ విచారణకు ఆదేశించగా ఆడిటర్లు కూడా లెక్కలను తేల్చేందుకు పరిశీలనలు చేపట్టారు. ఈ విచారణలో మున్సిపల్ అధికారులు నిర్వహించిన పరిశీలనలో 2021-22లో ప్రజల నుంచి రూ.55 లక్షల పన్నుల సొమ్మును వసూలు చేశారు. ప్రజలకు ఇంటిపన్నులకు సంబంధించి నమోదైన వివరాల ఆన్‌లైన్ రశీదులను ఇచ్చి, చెల్లించిన పన్ను నగదుకు ఆన్‌లైన్ రశీదులు ఇవ్వాలి. అలా ఇవ్వకుండా ఆఫ్‌లైన్‌లో రశీదులు జారీ చేసి ఆన్‌లైన్‌లో నగదు జమ చేయలేదని నిర్ధారించారు. దీనితో వసూలైన రూ.55 లక్షల్లో రూ.10లక్షలు జమ కాలేదని నిర్ధారించారు. దీనికి అప్పట్లో పనిచేసిన ఉద్యోగుల ప్రమేయంపై, విధుల నిర్వహణ లోపాలపై సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు నివేదించినట్లు మున్సిపల్ అధికారి ఒకరు తెలిపారు. దీనిపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. రూ.10 లక్షలకు సంబంధించి కొందరు ఉద్యోగులు కొంత నగదు జమ చేశారని తెలిపారు. నివేదిక పరిశీలించాక బాధ్యులపై ప్రభుత్వం చర్యలు తీసుకునే అవకాశం ఉందని చెబుతున్నారు.